తీరంలో కోలాహలం



భావనపాడు తీరంలో సందడి చేస్తున్న యాత్రికులు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని భావనపాడులో సముద్ర తీరంలో ఆదివారం పిక్నిక్ సందడితో కోలాహలం నెలకొంది. పలు ప్రాంతాల నుంచి యువత, మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి తీర ప్రాంతంలో కేరింతలతో సందడి చేశారు. తోటల్లో సేదతీరుతూ, సముద్ర స్నానాలు చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. అధిక సంఖ్యలో యాత్రికులు రావడంతో భావనపాడు తీరం సందడితో నిండిపోయింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా నౌపడ పోలీసులు, భావనపాడు మెరైన్ పోలీసులు సంయుక్తంగా పహారా కాసి, ప్రజలకు ప్రమాద హెచ్చరికలు సూచిస్తూ అవగాహన కల్పించారు.

రైతు ఘోష పట్టని రెవెన్యూ

- తప్పుల తడకలతో భూ రికార్డులు
- అవసరాలకు భూములు అమ్ముకోలేని రైతులు
- భూసేకరణ పని కోసం ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామంలో ప్రత్యేక గ్రీవెన్స్
- జిల్లాలోని ఇతర ప్రాంతాల రైతులను వదిలేసిన రెవెన్యూ అధికారులు

పొందూరు మండలం తాడివలసకు చెందిన పైడి కృష్ణారావుకు ఎనిమిది సర్వే నంబర్లలో సుమారు ఎకరా పొలం ఉంది. రీ సర్వేలో నాలుగు సర్వే నంబర్లు వేరే వ్యక్తుల పేరు మీద నమోదు కావడంతో ఒన్ బి రావడం లేదు. తహశీల్దార్, విఆర్ఒ, సర్వేయర్‌ను ఎన్నిసార్లు బతిమలాడుకున్నా సమస్య పరిష్కారం కాలేదు. ఒకవైపు పిల్లల చదువులు, మరోవైపు పెళ్లీడుకొచ్చిన కూతురు ఉండడంతో పొలం అమ్ముకోవాలనుకున్నా కుదరడం లేదు.



వజ్రపుకొత్తూరు : అర్జీలు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్ (ఫైల్)

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పొందూరు

ఇదే మండలం కనిమెట్టకు చెందిన కూన కృష్ణమూర్తి భార్య చిన్నమ్మడు పేరు మీద 49 సెంట్ల భూమి ఉండగా, ఆరు నెలల కిందట చేపట్టిన రీ సర్వేలో 24 సెంట్లు ప్రభుత్వ భూమిగా నమోదైంది. తప్పును సరి చేయాలంటూ తహశీల్దార్‌ను ఎన్నిసార్లు కలిశారో తెలియదు. కలెక్టరేట్‌కు పంపాం, అక్కడ నుంచి వస్తే పనైపోతుందంటూ అధికారులు బదులిస్తున్నారు. ప్రభుత్వ భూమిగా నమోదు కావడంతో రాబోయే రోజుల్లో తమకు దక్కకుండా పోతుందంటూ తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

వీరిద్దరే కాదు, జిల్లాలోని వేలాది మంది రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. కళ్లెదుటే ఆస్తి కనబడుతున్నా పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు, అనారోగ్యం తదితర కుటుంబ అవసరాలకు రైతులు భూములు అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది.

గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన భూ సమగ్ర సర్వేలో లోపాలను సరిదిద్దడానికి టిడిపి కూటమి ప్రభుత్వం మరోసారి సర్వే చేపడుతున్నా, ఆశించిన ఫలితాలు రావడం రావడం లేదు. జిల్లాలోని 30 మండలాల పరిధిలో 1465 రెవెన్యూ గ్రామాలు ఉండగా, ఇప్పటి వరకు 805 గ్రామాల్లో సర్వే పూర్తయింది. ప్రస్తుతం 85 గ్రామాలకు చెందిన 43,685 మంది రైతులకు సంబంధించిన 48,634 ఎకరాలకు సర్వే సాగుతున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఒకవైపు సర్వే జరుగుతున్నా మరో వైపు మండల, జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రైతుల నుంచి వచ్చిన కచ్చితమైన వినతులను పరిశీలించి తహశీల్దార్లు ఆర్‌డిఒకు లేఖలు పంపాలి. భూముల రీసర్వే, ధాన్యం కొనుగోలు తదితర పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండడంతో ఆ పనులపైనే దృష్టిపెడుతున్నారు. భూ సమస్యలపై మండలాలకు వచ్చిన వినతులపై కనీసం దృష్టిసారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కలెక్టరేట్ నుంచి వచ్చిన వినతులపై ఏదో తూతూమంత్రంగా స్పందిస్తున్నారన్న విమర్శలూ లేకపోలేదు. ప్రతి రైతుకూ సంబంధిచి ఒక నోట్ తయారు చేయడం, దాన్ని పై అధికారులకు పంపడానికి అధిక సమయం కేటాయించాల్సి రావడంతో, ఏదో పైపైన స్పందించి తిరుగు సమాధానం ఇస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రైతుల సమస్యలు అపరిష్కృతంగా ఉండిపోతున్నాయి. జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిస్థితిపై అటు కలెక్టర్ గానీ, ఇటు జాయింట్ కలెక్టర్ గానీ పర్యవేక్షించకపోవడం ఈ పరిస్థితికి దారి తీసిందన్న చర్చ నడుస్తోంది.

ఎయిర్‌పోర్టు గ్రామాల రైతులపై ఆకస్మిక ప్రేమెందుకో?

రెండేళ్లుగా తమ భూ సమస్యలను పరిష్కరించాలని తిరుగుతున్న మందస ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల రైతుల బాధలను పట్టించుకోని రెవెన్యూ అధికారులకు ఆకస్మికంగా వారిపై ప్రేమ పుట్టుకొచ్చింది. రైతుల సమస్యలను పరిష్కరించడానికి వారి కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహించడంపై అంతా ఆశ్చర్యపోతున్నారు. మందస కార్గో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సంబంధించి రైతులతో అభిప్రాయ సేకరణ చేస్తున్న సమయంలో రీసర్వే తప్పులు సరిచేయకుండా స్థానిక విఆర్‌ఒలు తిప్పుతున్నారని, డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్న రైతుల ఫిర్యాదులతో ఈనెల 11వ తేదీన ఆర్‌డిఒ వెంకటేష్ వజ్రపుకొత్తూరు మండలం గుణుపల్లి సచివాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ఇందులో ఒకే పేరుతో ఒక ఎల్‌పిఎం నంబరుతో పలువురు భూములు నమోదు కావడం, 1బి, అడంగల్, ఆస్తుల వివరాల తప్పులకు సంబంధించి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రెవెన్యూ అధికారులు అంత ప్రత్యేక శ్రద్ధ కనబరచడం వెనుక ఎయిర్‌పోర్టు భూసేకరణ పనిని చక్కపెట్టుకునే కార్యం దాగుందనే చర్చ నడుస్తోంది. భూ సమస్యలను పరిష్కరించారన్న సానుకూల దృక్పథాన్ని రైతుల్లో సృష్టించి, భూసేకరణకు సహరించేలా చేసుకోవడం కోసమే ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారన్న చర్చ నడుస్తోంది. పైగా భూముల వివరాలు సరిగా ఉంటేనే రైతుల భూములకు పరిహారం చెల్లించే అవకాశం ఉండడంతో, అధికారులు ఈ రకమైన ఎత్తుగడ వేశారన్న చర్చ నడుస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న మహాలక్ష్మి

'స్మార్ట్ కిచెన్'ను విరమించుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారానికి దశల వారీ పోరాటాలకు సిద్ధం కావాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు ఎ.మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ పెంపుదల చేయాలని కోరారు. మరోవైపు పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు స్మార్ట్ కిచెన్ సెంటర్ల ఏర్పాటును తక్షణమే విరమించాలని డిమాండ్ చేశారు. 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు, సౌకర్యాలు కల్పించకుండా పని చేయించుకుంటోందని చెప్పారు. రూ.మూడు వేలు గౌరవ వేతనం ఇచ్చి రోజు మొత్తం పని చేయిస్తున్నారని తెలిపారు. వీళ్లకు కనీస వేతనాలు గానీ కనీస భద్రత గానీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నెలవారీ సక్రమంగా మెనూ బిల్లులు చెల్లించకపోయినా, గౌరవ వేతనం సకాలంలో ఇవ్వకపోయినా అప్పు చేసి సొంత డబ్బులతో పిల్లలకు వేడి వేడి ఆహారాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఈ పథకానికి కావాల్సిన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వకుండా కోతలు విధిస్తూ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. కనీస వేతనం నెలకు రూ.పది వేలు, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రతి నెలా ఐదో తేదీ లోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని, మెనూ ఛార్జీలు ఒక్కో విద్యార్థికి కనీసం రూ.20, కళాశాల విద్యార్థులకు రూ.30 ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్టవ్, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. 12 నెలలకు వేతనాలు ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. వంట చేసేటప్పుడు ప్రమాదంలో చనిపోయిన కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, గాయాలపాలైన వారికి రూ.75 వేలు ఇవ్వాలని, నెలకు ఒక సెలవు మంజూరు చేయాలని, పెరిగిన ధరలకు కాగుణంగా బడ్జెట్ పెంచాలన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు టి.ప్రవీణ, బి.కన్యాకుమారి, జయలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

ప్రజాశక్తి - ఆమదాలవలస

రాష్ట్ర ప్రభుత్వ పింఛనదారులు జీవన ప్రమాణ ధ్రువపత్రాలు (లైఫ్ సర్టిఫికెట్స్)ను జనవరి ఒకటి నుంచి ఫిబ్రవరి 28వ తేదీ లోగా సమర్పించాలని ఉప ఖజానా అధికారి బి.కృష్ణారావు తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్స్‌ను నెట్ సెంటర్‌లో గానీ జిల్లా ట్రెజరీలో గానీ సబ్ ట్రెజరీలో గానీ సమర్పించవచ్చని తెలిపారు. ఎవరైనా అనారోగ్య కారణాలతో గానీ వృద్ధాప్యం కారణంగా గానీ బయోమెట్రిక్ పడని వారు తమ లైఫ్ సర్టిఫికెట్స్‌ను ఫిజికల్‌గా ఉప ఖజానా అధికారికి ఫిబ్రవరి 28వ తేదీ లోగా సమర్పించవచ్చని పేర్కొన్నారు. జిఒ నంబరు 315 ద్వారా పెన్షన్ అందుకుంటున్న పింఛనుదారులు స్వయంగా వారి సంబంధిత సబ్ ట్రెజరీకి వెళ్లి సంబంధిత పత్రాలతో లైఫ్ సర్టిఫికెట్స్‌ను సమర్పించాలని తెలిపారు.

అభివృద్ధి పనులు వేగవంతం

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



వినతులను స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు విడుదల చేస్తోందని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుంటూ నిర్ణీత కాలవ్యవధిలో పనులు పూర్తిచేయాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తాగునీరు, రహదారులు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మహాత్ముడే మెచ్చిన పొందూరు ఖాదీకి జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ (జిఐ) (1049) ట్యాగ్ ఇస్తూ, కేంద్రం నిర్ణయం వెలువరించడం అన్నది తనకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

సంతబొమ్మాళి మండలం కోటపాడు, వడ్డితాడ్ర పంచాయతీలకు చెందిన పలువురు టిడిపిలోకి చేరాయి. మండలంలోని నిమ్మాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కోటపాడు పంచాయతీ మాజీ సర్పంచ్ అప్పల రాజు, రెడ్డి అప్పన్న అధ్యక్షతన వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని అన్నారు. అందుకే వివిధ గ్రామాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా టిడికిలో చేరుతున్నారని పేర్కొన్నారు. మరింత కృషితోనే గ్రామాభివృద్ధి సాధ్యమన్నారు. మంత్రిగా తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో గాడి తప్పిన పాలన

- పిపిపితో వైద్య విద్య పేదలకు దూరం
- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని మాజీ మంత్రి, వైసిపి డాక్టర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షులు సీదిరి అప్పలరాజు విమర్శించారు. నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఎట్టి పరిస్థితుల్లోనూ మంచిది కాదని స్పష్టం చేశారు. ప్రైవేటు వ్యక్తులకు లాభాలను పంచే విధానమే పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) అని తెలిపారు. టిడిపి కరపత్ర పత్రికల ద్వారా ప్రైవేటీకరణ మంచిదన్నట్లు తప్పుడు వార్తలు రాయిస్తున్నారని చెప్పారు. మెడికల్ కళాశాలలు పూర్తయితే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి పేరు వస్తుందని కూటమి ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందన్నారు. అమరావతి కోసం, పుష్కరాల కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని, మెడికల్ కళాశాలల కోసం ఎందుకు ఖర్చు చేయరని ప్రశ్నించారు. పేద విద్యార్థుల ప్రయోజనాలను పక్కన పెట్టి, అడ్డగోలు దోపిడీకి పూనుకుంటున్నారని విమర్శించారు. పిజి సీట్లు సెల్ఫ్ ఫైనాన్స్‌గా మార్చి పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలు చేసిన కోటి సంతకాలను ఈనెల 15న శ్రీకాకుళం నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న భారీ ర్యాలీని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న అప్పలరాజు

సూపర్ సిక్స్ హామీల అమల్లో ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. అనేక కోతలు, ఆంక్షలతో కొన్ని పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అమ్మకానికి ఆంధ్రప్రదేశ్ పథకం అమలు చేస్తున్నారని... ప్రైవేటీకరణకు, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నారని ధ్వజమెత్తారు. ఎత్తిపోతల పథకాలనూ ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తామని చెప్పడం అన్యాయమన్నారు. హార్బర్లు, పోర్టులు ప్రైవేటీకరణకు సిద్ధమవుతున్నారని తెలిపారు. మరోవైపు ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తున్నారని చెప్పారు. ఎకరా భూమిని 99 పైసలకు లీజు చొప్పున రియల్ ఎస్టేట్‌కు అమ్మకాలు చేస్తున్నారని విమర్శించారు. ఏడాదిలో రూ.2.66 లక్షల కోట్ల అప్పులు చేసి, అన్ని ప్రభుత్వ శాఖలను విధ్వంసం చేశారని చెప్పారు. రాష్ట్రంలో నేరాలు పెరుగుతున్నాయన్నారు.

గంజాయి రహిత సమాజం నిర్మిద్దాం

ఎస్‌పి కె.వి. మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

గంజాయి వంటి మత్తు పదార్థాలు నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో (పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు) సాగుతున్న అభ్యుదయం సైకిల్ యాత్ర ఈ నెల 16న శ్రీకాకుళం పట్టణంలోకి ప్రవేశిస్తునట్లు ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సైకిల్ యాత్రకు ప్రజలు, ముఖ్యంగా యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉదయం 9 గంటలు సింహద్వారం మీదుగా ఎర్రన్నాయుడు ఆర్చ్ కూడలి, డేఅండ్‌నైట్, రామలక్ష్మణ, సూర్యమహల్, జి.టి.రోడ్డు, సెవెన్ రోడ్డు కూడలి, ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో భారీ బహిరంగ, అవగాహన సభ నిర్వహిస్తారని తెలిపారు. గంజాయి వంటి మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. సమాజం గంజాయి రహితంగా మారేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు, యువత, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామస్థాయి నుంచి బలోపేతం

జనసేన ఎమ్మెల్యేలతో నాగబాబు

ప్రజాశక్తి - లావేరు

జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబును అన్నారు. శ్రీకాకుళం జిల్లా లావేరులోని జనసేన పార్టీ కార్యాలయంలో విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ఆదివారం నాగబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యేలతో ఆయన భేటీ అయ్యారు. క్రియాశీలక సభ్యత్వ నమోదును ఉద్యమంలా కొనసాగించాలని సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జనసేన పార్టీ ఆశయాలు, ఉద్దేశాలు ప్రజల్లోకి మరింత బలంగా తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో జనసేన ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, లోకం నాగమాధవి, నిమ్మక జయకృష్ణ, ఎచ్చెర్ల నియోజకర్గ ఇన్‌ఛార్జి విశ్వక్సేన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగబాబు

ఉపాధి కల్పన లక్ష్యంగా ముందుకు

- ప్రైవేట్ కంపెనీలతో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ల నిర్వహణ
- ప్రభుత్వ శాఖల సమన్వయంతో జాబ్‌మేళాలు
- జిల్లా ఉపాధి అధికారి కె.సుధ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

యువతకు ఉద్యోగ ఉపాధి కల్పన లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. ప్రైవేట్ కంపెనీలతో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్హత బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కారుణ్య నియామకాల్లో జాప్యం లేకుండా ఉద్యోగ నియామకాలు చేపడుతున్నామని చెప్పారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి పలు అంశాలు వెల్లడించారు.

? ఎటువంటి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు?

ప్రైవేట్ కంపెనీల్లో నియామకాలకు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నాం. కంపెనీల నేరుగా ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగ ఎంపిక చేస్తున్నాం. విద్యార్హత, నైపుణ్యాలు ఆధారంగా విద్యార్థులకు ప్యాకేజీలు లభిస్తున్నాయి. ఇంజినీరింగ్ వంటి విద్య పూర్తి చేసిన వారికి మంచి అవకాశాలు లభిస్తున్నాయి. భవిష్యత్తులో మెరుగైన కంపెనీలు ద్వారా క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహణకు కృషి చేస్తున్నాం.

? జిల్లాలో ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారు?





జిల్లాలో 2024 జనవరి నుంచి ఈ నెల వరకు 4,578 మందికి ఉద్యోగాలు కల్పించాం. ప్రభుత్వ రంగంలో 96 కారుణ్య నియామకాలు చేపట్టాం. ప్లేస్‌మెంట్ కోసం విస్తృతంగా జాబ్‌మేళాల నిర్వహణకు ప్రభుత్వ సూచన మేరకు కృషి చేస్తున్నాం. పదో తరగతి నుంచి పిజి వరకు విద్యార్హత ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తున్నాం.

? జాబ్‌మేళా నిర్వాహణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎపి నైపుణ్య అభివృద్ధి సంస్థ, యువజన సర్వీసులశాఖ, ప్రైవేట్ కళాశాలాలు, ప్రభుత్వ కళాశాలలు సంయుక్తంగా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇంజినీరింగ్‌లో ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నాయి. రూ.5 లక్షల వరకు ప్యాకేజీలు జిల్లాలో లభిస్తున్నాయి. ప్రతి కళాశాలల్లోనూ ప్లేస్‌మెంట్ సెల్ నిర్వహిస్తున్నాం. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో యువత స్కిల్స్ ఆధారంగా ఉద్యోగాలు లభిస్తున్నాయి.

? యువతలో స్కిల్స్‌కు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎపి నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన శిక్షణ ఇస్తున్నాం. ప్రభుత్వ ఐటిఐలో స్కిల్ హబ్‌లు నిర్వహిస్తున్నాం. ఐటిఐ, పాలిటెక్నిక్ డిప్లమా వంటి కోర్సులు పూర్తిచేసిన వారికి మంచి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. నైపుణ్య శిక్షణ ఇవ్వడం, అప్రెంటిస్, ఇంటర్న్‌షిప్ వంటివి అమలు చేస్తున్నాం. ప్రధానంగా నైపుణ్యం ఉంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

? ఇంజినీరింగ్ కాలేజీల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు ఏ స్థాయిలో ఉన్నాయి?

ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. భవిష్యత్‌లో ఇంటర్వ్యూల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. విశాఖపట్నంలో సాఫ్ట్‌వేర్ పరిశ్రమలు అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

? విద్యార్థులు ఎటువంటి నైపుణ్యాల అవసరం?

విద్యార్థుల్లో వారు చదువుతున్న కోర్చుకు సంబంధించి సబ్జెక్టు విషయ పరిజ్ఞానం, సాంకేతిక అంశాలపై పట్టు, ప్రస్తుత పారిశ్రామిక అవసరాలపై అవగాహన, కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్, ఆంగ్ల పరిజ్ఞానం వంటివి అవసరం. విద్యార్థుల్లో నైపుణ్యాలు ఉంటే మంచి ప్యాకేజీకి ఎంపికవుతారు. డిగ్రీ విద్యార్థుల సైతం క్యాంపస్ డ్రైవ్‌లో మంచి ప్యాకేజీలకు ఎంపిక అవుతున్నారు. ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే స్కిల్స్ విద్యార్థుల్లో అవసరం.

తూర్పు కాపులకు రాజకీయ ప్రాతినిధ్యం

● చట్టసభల్లో అవకాశం కోసం కృషి
● సంఘ జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

తూర్పుకాపులకు రాజకీయ ప్రాతినిధ్యం కోసం తనవంతు కృషి చేస్తున్నట్టు సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ చెప్పారు. చట్టసభల్లో తూర్పు కాపులకు జనసేన పార్టీ తరుపున తనవంతు ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. చట్టసభల్లో రాజకీయ ప్రాతినిధ్యం లభించినప్పుడే రిజర్వేషన్ల సాధనకు, జాతి ఔనత్యాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి దోహదపడు తుందన్నారు. తూర్పుకాపులకు సంబంధించి ఒబిసి రిజర్వేషన్ల అమలు రాష్ట్రమంతటా ఒకే తీరున లేదన్నారు. ఉత్తరాంధ్రలో ఒబిసి రిజర్వేషన్లు అమలవుతుండగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల వారు రిజర్వేషన్లకు నోచుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ప్రధాని మోడీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాతో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మాట్లాడారని, ఇందు కోసం నియమించిన కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారని గుర్తు చేశారు. కమిషన్ అనుకూలంగా తీర్పునిచ్చిన నేపథ్యంలో పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టిన తర్వాత రిజర్వేషన్ల అంశం ఒక కొలిక్కి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తూర్పు కాపు సంక్షేమ సంఘం కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూనే జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం అధ్యక్షుడిగా పార్టీ బలోపేతం కోసం కృషి సాగిస్తున్నట్టు తెలిపారు. పార్టీని క్షేత్ర స్థాయిలో పటిష్ట పరచడానికి గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలోఐదుగురు సభ్యులతో ఒక కమిటీని



ఏర్పాటు చేసే యోచనలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఉన్నారని తెలిపారు. పార్టీ కోసం పని చేసిన వారిని గుర్తించి అందుకనుగుణంగా జిల్లాలోని పలువురు నాయకులకు నామినేటెడ్ పదవులను ఇచ్చారని చెప్పారు. తనకు పదవులతో సంబంధం లేదని, పార్టీ ఏ బాధ్యతను అప్పగిస్తే దానిని స్వీకరిస్తానని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత టిడిపి నాయకులు పట్టించుకోవడం లేదనే అసంతృప్తి జనసేన కేడర్‌లో ఉండటం కొంత వరకు వాస్తవమేనని, ప్రస్తుతం క్రమేణా అది సర్దుకుంటోందని తెలిపారు. రాబోవు స్థానిక ఎన్నికల కోసం పార్టీని, క్యాడర్‌ను ఇప్పటి నుంచే సిద్ధం చేస్తున్నామని, అంతా ఐక్యంగా పని చేసి మంచి ఫలితాలు సాధిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

అగ్రహారం రైతులకు న్యాయం జరిగేనా!

● అధికారుల తీరుతో నష్టపోతున్న వైనం
● రీ సర్వేలో తప్పుల బాధ్యత ఎవరిది?

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని కొర్లం పంచాయతీ పరిధిలోని అగ్రహారం రైతులకు గత ప్రభుత్వ హయాంలో అధికారులు చేసిన తప్పుడు రీ సర్వే ఫలితంగా భూములు కోల్పోయే పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఏళ్ల తరబడి వంశపారంపర్యంగా సాగు చేసుకుంటున్న భూములపై తమకు హక్కులు లేవని, ఈ భూములు ఒడిశా రాష్ట్రం జయంతిపురానికి చెందిన భువనేశ్వర పాడి వారసులవని అధికారులు తప్పుడు నమోదులు చేయడంతో కుటుంబాలతో రోడ్డున పడి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే... వాస్తవానికి ఆ భూములు 1960 సంవత్సరం తరువాత సదరు భువనేశ్వర పాడి నుంచి ప్రస్తుత రైతుల పూర్వీకులు దశలవారీగా కొనుగోలు చేసిన భూములే. 2023 సంవత్సరంలో రీ సర్వే సమయంలో ప్రస్తుత రైతులతో రీసర్వే చేశారు. రీసర్వే అనంతరం సదరు భూముల లాగిన్ అప్పటి తహశీల్దార్ నిలుపుదల చేశారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు అప్పటి తహశీల్దార్‌ను కలిశారు. ఆ భూములు భువనేశ్వర పాడి వారసులవని, వెబ్‌ల్యాండ్‌లో సదరు భూములు భువనేశ్వర పాడివిగా చూపిస్తుందని వివరణ ఇచ్చారు. వాస్తవానికి రీసర్వే సమయంలో వారి వారసులెవరూ వ్యక్తిగతంగా హాజరు కాలేదు. అయితే వారసుల్లో ఒకరు ఆ భూములు తమవేనని, వాటిని అమ్మకానికి అనుమతించరాదని తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో అగ్రహారం రైతులంతా తమ భూములు తమకు చెందేలా చర్యలు తీసుకోవాలని, తప్పుడు రీసర్వే చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిఎం, కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్ మీకోసంలో తమకు జరిగిన అన్యాయాన్ని తెలియజేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్‌కు కూడా విన్నవించుకున్నారు. రైతులు దశాబ్దాలుగా తమ భూములకు సంబంధించిన హక్కు పత్రాలు కలిగి ఉండడమే కాకుండా భూమి శిస్తులు కడుతున్నారు. అడంగల్, 1బి పత్రాలు ప్రభుత్వం నుంచి పొందుతున్నారు. బ్యాంకు నుంచి లోను సదుపాయాలు పొందుతున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పంట నమోదు ధాన్యం, ఇతర పంటలు అమ్మకాలు చేస్తున్నారు. ఇన్నేళ్లుగా సాఫీగా సాగిన అగ్రహారం రైతుల సాగు, కొందరు అధికారుల చేతివాటంతో జీవన్మరణ సమస్యగా మారింది.

అధికారుల చేతివాటమే అసలు కారణం?

దశాబ్దాలుగా వారసత్వంగా తమకు వచ్చిన భూములను సాగు చేస్తున్న అగ్రహారం రైతుల పాలిట కొందరు అధికారుల అవినీతి చేతివాటమే శాపంగా మారిందని వ్యాఖ్యానాలు జోరుగా వినిపిస్తున్నాయి. రీ సర్వే సమయంలో కొంతమంది అధికారులు డబ్బులకు ఆశించి భువనేశ్వర పాడి వారసులతో కలిసి ఈ మోసానికి



అగ్రహారం భూములు

తెరతీసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అప్పటివరకు అడంగల్, 1బిలో స్థానిక రైతుల పేర్లు ఉన్నాయి. వెబ్ ల్యాండ్‌లో చూస్తే అప్పుడు వారసుల పేర్లు ఎలా ప్రత్యక్షమయ్యాయో అధికారులకే తెలియాలి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ సమస్యపై స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎవరూ కొనడం లేదు



తనకు 60 సెంట్లు భూమి ఉంది. ప్రస్తుతం తనకు కొంత అప్పు ఉంది. భూమి అమ్మి అప్పు తీర్చేద్దామని అనుకున్నా. 60 సెంట్లు భూమి తన పేరు మీద లేకపోవడంతో అమ్మకానికి ఇబ్బందులు పడుతున్నా. ఎవరూ కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేదు.

- రాంబుడ్డి అప్పలమ్మ, కొర్లాం, గోనకపాడు వీధి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

మహాసభలు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పలాస

విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు సిఐటియు అఖిల భారత మహాసభల విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్. గణపతి పిలుపునిచ్చారు. కాశీబుగ్గలో ఆదివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు, ప్రజా సమస్యలపై ప్రస్తావిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో స్కూల్ స్వీపర్స్ యూనియన్ నాయకులు బి.స్వాతి, శకుంతల, టి.సుశీల, ఎం.స్వాతి, భగవతమ్మ, భారతి పాల్గొన్నారు.



ఎంపికైన నూతన కార్యవర్గం

రంగస్థల కళాకారుల కార్యవర్గం ఎన్నిక

అరసవల్లి: శ్రీకాకుళం రంగస్థలం కళాకారుల సమాఖ్య కార్యవర్గం ఎన్నిక ఆదివారం కళాకారుల సమాఖ్య భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 2026 సంవత్సరానికిగాను గౌరవ అధ్యక్షుడిగా చిట్టి వెంకటరావు, కార్యనిర్వాహక అధ్యక్షునిగా పన్నాల నరసింహమూర్తి, అధ్యక్షులుగా ఎల్.రామలింగస్వామి, కార్యదర్శిగా బి.రామచంద్ర దేవ్, కోశాధికారిగా ఐ.రమణారావు, ఉపాధ్యక్షులుగా కలగ గణేష్‌యాదవ్, మెట్ట వెంకటరాజు, బి.ఎన్.భూషణ్, సంయుక్త కార్యదర్శులుగా ఎన్ని రాజేశ్వం రావు, పైడి సత్యవతి, జ్యోతి, ఎస్.గణేష్, గౌరవ సలహాదా రులుగా బిఎ మోహనరావు, పిఎంజె బాబు, న్యాయ సలహాదారుగా కంచరాన అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నుకోగా కార్యవర్గ సభ్యులుగా ఇయాల నందికేశ్వరరావు, బిఎంఎస్ పట్నాయక్, మంతిన వాసు దేవా చారి, వంజరాపు సత్యం, ఆశాలత ఖాన్, మెట్ట పోలి నాయుడు, మజ్జి మోహన్‌రావు, రౌలో, భగ్గం అప్పాజీ, డి.లీలామోహన్ పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా విశ్రాంత బ్యాంకు అధికారి కంచరాన అప్పారావు వ్యవహరించారు.



ఆర్థికసాయం అందజేస్తున్న కరస్పాండెంట్ భారతి

'సాయి శిరీష' విద్యార్థుల ఔదార్యం

పలాస: కాశీబుగ్గ చిన్నబాడాంలోని సాయి శిరీష పాఠశాల విద్యార్థులు తమ ఔదార్యం చాటుకున్నారు. వజ్రపుకొత్తూరు మండలం హుకుంపేటకు చెందిన వంక కృష్ణారావుకు సాయి శిరీష విద్యార్థులు రూ.1.44 లక్షలు చందాలు, వసూలు చేశారు. ఈ మొత్తాన్ని పాఠశాల కరస్పాండెంట్ కవిటి భారతి, రేణుకేశ్వరరావు బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం ఆర్థికసాయం అందించారు. సాయి శిరీష పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న వంక లిఖిత్ కుమార్ తండ్రి కృష్ణారావుకు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం శ్రీకాకుళం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం, తోటి విద్యార్థులు నడుంబిగించారు.

ఫణిబాబుకు జ్యోతిష్య శాస్త్రంలో అవార్డు

రణస్థలం: ఒడిశా రాష్ట్రం పూరీలో ఆదివారం జరిగిన అంతర్జాతీయ జ్యోతిష్య సమాఖ్య, అమెరికా వారు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన సభలో పాల్గొని 'దివ్యజ్ఞాన మరియు దైవిక వారసత్వం' 'జ్యోతిష్య శాస్త్రం, ఆధ్యాత్మిక స్పృహ మధ్య విశ్వ సంబంధాన్ని అన్వేషించడం' అనే అంశంపై ఉపన్యసించినందుకు మండలంలోని చిల్లపేటరాజాం గ్రామానికి చెందిన ఆకెళ్ళ ఫణిబాబుకు 'జ్యోతిష్ వశిష్ట' అనే అరుదైన అవార్డు లభించింది. ఈ అవార్డు రావడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి అవార్డులు ఎన్నో సాధించాలని కోరారు.



నూతనంగా నిర్మించిన సిసి రహదారి

తీరిన రహదారి కష్టాలు

ఎచ్చెర్ల : మండల పరిధిలో కేశవరావుపేటలో గల ఓ వీధి పరిధిలో 20 కుటుంబాలు నివాస ముంటున్నాయి. 2006 ఆ వీధిలో రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఏళ్ల గడిచేకొద్దీ ఆ రోడ్డు పగిలిపోయి ప్రయాణాలకు ఇబ్బంది కలిగే విధంగా ఉండేది. ఇటీవల కొన్నేళ్లుగా కురుస్తున్న వర్షాలకు ఆ రోడ్డుపై వర్షపునీరు నిలిచిపోవడంతో అక్కడ నివాసం ఉంటున్న ప్రజలు అష్ట కష్టాలను ఎదుర్కొన్నారు. రోడ్డుపై నిలిచిన నీరు మురికిగా మారి జ్వరాల బారిన పడే సందర్భాలు దాపురించాయి. ఈ రోడ్డు నిర్మించాలని ప్రజా ప్రతినిధులకు ప్రజలు విన్నవించుకోగా రూ.2 లక్షల వ్యయంతో కొత్త సిసి రహదారి నిర్మాణం చేపట్టారు. ఇప్పటికి తమ కష్టాలు తీరాయని ఆ వీధివాసులు సంతోషం వ్యక్తం చేశారు. రోడ్డు వేసేందుకు కృషి చేసిన సర్పంచ్, ప్రజాప్రతినిధులు, అధికారులకు అభినందనలు తెలియజేశారు.

28న ఒడియా గణిత ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి- కవిటి

ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (అపోటా) ఆధ్వర్యాన ఒడియా గణిత ఉపాధ్యాయుల వేదిక సహకారంతో జిల్లాస్థాయి ఒడియా గణిత ప్రతిభా పరీక్షను ఈ నెల 28న నిర్వహించనున్నట్లు అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందావన్ దోళాయి తెలిపారు. ఈ పరీక్షలో ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఒడియా మాధ్యమంలో చదువుతున్న 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఇచ్ఛాపురం, సోంపేట, మందస, పలాస, మెళియాపుట్టి, టెక్కలి, బత్తిలి ప్రాంతాల్లోని ఉన్నత పాఠశాల కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల నుంచీ తరగతికి ఏడుగురు విద్యార్థుల పేర్లను సంబంధిత మండలాల అపోటా అధ్యక్షులు, కార్యదర్శులకు పంపించాలని బృందావన్ సూచించారు. జిల్లాస్థాయిలో నిర్వహించనున్న ఈ ఒడియా గణిత ప్రతిభా పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయులు, విద్యాసంస్థల ప్రతినిధులు, తల్లిదండ్రులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



దుప్పట్లను పంపిణీ చేస్తున్న పాపారావు

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అప్పలపేట పంచాయతీ పరిధిలో ఉన్న అనంతగిరి పేటకు చెందిన ఓ అన్నదాత గిరిజనులకు ఆదివారం దుప్పట్లను పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని లక్కుపురం గ్రామానికి చెందిన రైతు ముడిలి పాపారావు మాట్లాడుతూ తాను వ్యవసాయాన్ని చేపట్టినప్పటి నుంచి అన్ని ప్రభుత్వాల ఆధ్వర్యంలో తనకు పెట్టుబడి సాయం కింద అందుతుందన్నారు. ప్రభుత్వాలు మారినప్పటికీ అన్ని ప్రభుత్వాల హయాంలో కూడా రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందుతుందని రైతు సంతోషపడ్డారు. గిరిజనుల ప్రజలతో పంచుకోవాలని ఉద్దేశంతో గ్రామస్తులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని 40 మంది వృద్ధులకు దుప్పట్లను అందజేశారు.

'సైకిల్ యాత్ర' విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న 'అభ్యుదయం సైకిల్‌యాత్ర' ను విజయవంతం చేయాలని జె.ఆర్.పురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.అవతారం పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 9 గంటలకు రామతీర్థాల జంక్షన్ నుంచి ర్యాలీ ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలతో పాటు అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొంటారన్నారు. యువతను మాదకద్రవ్యాల దుష్ప్రభావాల నుంచి రక్షించి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొని తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆయన కోరారు. ప్రత్యేకించి యువత ఈ సైకిల్‌యాత్రలో భాగస్వాములై మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి మద్దతు తెలపాలని, సమాజానికి మంచి సందేశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండల పరిధిలో సంత సీతారాంపురంలోని కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో 3వ రోజు జరిగిన క్రీడా పోటీల్లో జావెలిన్ త్రోలో సైసెస్ వ్యవసాయ కళాశాలకు చెందిన కిరణ్‌నాయక్ స్వర్ణపతకం, బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన పి.నిఖిల్ వెండిపతకం, ట్రిపుల్ జంప్‌లో బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన బి.చంద్రశేఖర్ స్వర్ణపతకం, తిరుపతి ఎస్‌విసి కళాశాలకు చెందిన నిర్మల్ వెండి పతకం, ఉదయగిరి వ్యవసాయ కళాశాలకు చెందిన వి.లక్ష్మణ రజిత పథకం సాధించారు. 200మీ రన్నింగ్‌లో తిరుపతి ఎస్‌విసి కళాశాలకు చెందిన లక్షయ్ జయన్ స్వర్ణపతకం, నైరా వ్యవసాయ కళాశాలకు చెందిన భానుప్రకాష్ వెండి పతకం, ఉదయగిరి వ్యవసాయ కళాశాలకు చెందిన వైకుంఠ లక్ష్మణ్ రజిత పథకం సాధించారు. విజేతలకు సై, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.ఎల్. నారం నాయుడు అభినందించారు.

జనసేన బలోపేతానికి కృషి



నాగేందర్

బూర్జ : జనసేన పార్టీ గ్రామ స్థాయిలో బలోపేతం అవ్వడానికి కార్యకర్తలు కష్టపడి పని చేయాల్సిన అవసరం ఉందని జనసేన మండల అధ్యక్షులు కొత్తకోట నాగేంథర్ అన్నారు. కార్యకర్తలు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో టిడిపి, బిజెపితో కలిసి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కష్టపడి పని చేసిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. ప్రతిఒక్క కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు.

కాటేసిన కిడ్నీ వ్యాధి

● కిడ్నీ వ్యాధితో యువకుడు మృతి
● దిక్కులేని వారైన ఇద్దరు చిన్నారులు, భార్య

ప్రజాశక్తి- కవిటి

కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న ఆ యువకుడిని కిడ్నీలు కాటేశాయి. దీంతో ఆ యువకుడిపై ఆధారపడిన ఇద్దరు చిన్నారులు, అతని భార్య దిక్కులేని వారయ్యారు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని తొత్తిడిపుట్టుగకు చెందిన పొడియా పురుషోత్తం (30) కిడ్నీవ్యాధికి గురై పది రోజుల క్రితం మృతి చెందాడు. దీంతో రెక్కాడితే గానీ డొక్కాడని అతని కుటుంబం దయనీయ స్థితిలోకి జారుకుంది. పురుషోత్తం మృతితో అతని భార్య జమున, కుమార్తెలు ఐదేళ్ల ఊర్మిళ, లక్ష్మీప్రసన్న కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కలకాలం తోడుంటానన్న భర్త ఆరంభంలోనే తనువు చాలించడంతో జమున మౌనంగా రోదిస్తోంది. మరోవైపు తనపై ఆధారపడి ఉన్న అనారోగ్యంతో బాధపడు తున్న అత్త మామలు, ఇద్దరు చిన్నారులను చూస్తూ కన్నీరు కారుస్తోంది. దయనీయ స్థితిలో ఉన్న తనకు దాతలు అండగా నిలవాలని మౌనంగా ఆర్థిస్తోంది. దయార్ద్ర హృదయాలు ఫోన్ పే 9676262292 నంబరు, ఎపిజివిబి 6235100 17872309, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్ ఎపిజివి 00011850 అకౌంట్‌కు సాయం అందించాలని వేడుకుంటోంది.



ఇద్దరు చిన్నారులతో జమున



మృతి చెందిన నర్సింగరావు, నర్సింగరావు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారి రణస్థలం మండల కేంద్రంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో లావేరు మండలం వేణుగోపాలపురానికి చెందిన యువకుడు దురగాశి నర్సింగరావు (26) మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం ఉదయం తన స్వగ్రామం వేణుగోపాలపురం నుంచి రణస్థలం ద్విచక్ర వాహనంతో వస్తుండగా రణస్థలం మండల కేంద్రంలో ఫ్లైఓవర్ బ్రిడ్జికి సంబంధించి పిల్లరు కోసం తవ్వుతున్న గుంతలో ద్విచక్ర వాహనంతో అదుపుతప్పి పడిపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. సంఘటనా స్థలంలోనే యువకుడు మృతి చెందాడు. మృతుడికి వివాహం జరగలేదు. మృతుడికి తల్లిదండ్రులు లచ్చుము, సన్యాసమ్మ, అన్నయ్య రమేష్, అక్క పార్వతి ఉన్నారు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుంతలో నుంచి బయటకు తీసి శవ పంచనామా జరిపి పోస్ట్‌మార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

ఆలయ ధర్మకర్త మృతి



వెంకటరమణ (ఫైల్)

రణస్థలం: మండలంలోని కోష్ట గ్రామానికి చెందిన శ్రీకనక దుర్గ అమ్మవారి గుడి ఆలయ ధర్మకర్త సుగ్గు వెంకట రమణ (70) శనివారం రాత్రి గుండె పోటుతో మరణించారు. వల్లభరావు పేట గ్రామానికి చెందిన సుగ్గు వెంకటరమణ కోష్ట గ్రామంలో సుమారు 15 ఏళ్ల క్రితం శ్రీకనకదుర్గ అమ్మవారి గుడి నిర్మాణం చేసి ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి అందరికీ సుపరిచితుడు. ఆయన మృతితో ప్రజలు సంతాపం తెలిపారు. ఆదివారం ఉదయం ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి నాయకులు పిన్నింటి సాయికుమార్ ఆయన మృతదేహానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. పలువురు రాజకీయ నాయకులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



మాట్లాడుతున్న సత్యసాయి సంస్థల రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణరావు

ట్రైబల్ హెల్త్ కేర్ ఏర్పాటు

ప్రజాశక్తి- అరసవల్లి

శ్రీకాకుళం జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థల జిల్లా సమావేశం ఆదివారం సత్యసాయి సేవాసమితి పెద్ద మందిరంలో జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి విశిష్ట అతిథిగా వచ్చిన సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించటానికి సత్యసాయి ట్రైబల్ హెల్త్ కేర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గిరిజనులకు ప్రత్యేక నూతన సేవలు చేయడానికి శ్రీకాకుళం నుంచి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. ఈ సేవ ద్వారా గిరిజన గ్రామాలను దత్తత తీసుకుని మొబైల్ హెల్త్ కేర్ వాహనం ద్వారా నెలకు ఒకటి లేదా రెండుసార్లు గ్రామాలను సందర్శించి, బిపి, షుగర్, కిడ్నీ రోగాలు తదితర వాటిపై ఉచిత రక్త పరీక్షలు నిర్వహించి, ముందస్తు రోగాలను నిర్ధారించి గిరిజనులకు ఆరోగ్య అవగాహన కల్పించి దీర్ఘకాలిక రోగాల బారిన పడకుండా ఆరోగ్యకరమైన గిరిజన గ్రామాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ బంగ్లా దరి శ్రీసాయి గణేష్ మందిరంలో శ్రీ సత్యసాయి ఆశ్రిత సేవ ఇప్పటికే ప్రారంభించి విద్యావంతులైన గ్రామీణ యువకులు పోటీ పరీక్షలకు చదువుకుని ఉద్యోగం సంపాదించే వరకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కమలా త్రివేణి, పెద్ద మందిరం కన్వీనర్ కంబ మురళీకృష్ణ, జిల్లా, జోనల్ పదాధికారులు, కన్వీనర్లు, బాలవికాస్ గురువులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

చీకట్లో వెలిగిన దీపం

● ఆదుకున్న స్నేహబంధం
● రూ.1,10,500 ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కవిటి

చిరునవ్వుల వయసులోనే ఆ చిన్నారులకు జీవితం కఠినమైన పాఠం నేర్పింది. తల్లిదండ్రుల ప్రేమ, భద్రత లేకుండా రెండు చిన్న హృదయాలు అనాథలయ్యాయి. అయినా ఆ చీకటి జీవితంలో ఆశ వెలుగును నింపింది ఒక గొప్ప స్నేహ బంధం. మండలంలోని బి.జి.పుట్టుగకు చెందిన బడగల చరణ్, అనన్యల తల్లి కళావతి కిడ్నీ వ్యాధితో ఇటీవల కన్నుమూశారు. తండ్రి శివాజీ అదే వ్యాధితో మూడేళ్ల క్రితమే మృతి చెందారు. తల్లిదండ్రుల ఆత్మీయతకు దూరమైన ఈ చిన్నారులు తమ భవిష్యత్ ఏంటన్న ప్రశ్నతో నిలిచిపోయారు. వారి పరిస్థితిని తెలుసుకున్న చరణ్ స్నేహితులు, అతని అన్నయ్య మిత్రులు మౌనంగా ఉండలేకపోయారు. 'మనసుంటే మార్గం ఉంటుందనే' నమ్మకంతో ముందడుగు వేశారు. ఈ ప్రయత్నానికి భైరిపురం గ్రామస్తులు హృదయపూర్వకంగా చేయూతనిచ్చారు. అదే గ్రామానికి చెందిన పిరియా రాజగోపాలం తనవంతుగా రూ.50 వేల ఆర్థికసాయం అందిస్తూ మానవత్వానికి అర్థం చెప్పారు. ఇలా స్నేహితులు, గ్రామస్తుల సమిష్టి సహకారంతో సేకరించిన మొత్తంతో ఆదివారం గ్రామానికి చేరుకుని రూ.1,03,000లను ఆ పిల్లల పేరున ఫిక్స్ డిపాజిట్‌గా జమ చేశారు. భవిష్యత్‌కు భరోసాగా నిలిచేలా రూ.5,500 నగదు, రూ.2 వేల విలువైన నిత్యావసర సరుకులను కూడా అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బద్రి ప్రకాష్ మాట్లాడుతూ చిరుప్రాయంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు అండగా నిలిచిన స్నేహితులు, భైరపురం గ్రామస్తులు సమాజానికి ఆదర్శం. ఈ చిన్నారుల్లో అపారమైన భవిష్యత్ ఉంది. వారికి అండగా నిలిచేందుకు మరింతమంది దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



నగదు అందిస్తున్న యువకులు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

40 ధాన్యం బస్తాలు దగ్ధం

మెళియాపుట్టి: మండలంలోని కేరాసింగిలో గుర్తు తెలియని వారు నిప్పు పెట్టడంతో గిరిజన రైతు గొరేష్‌కు చెందిన 40 బస్తాల ధాన్యం శనివారం కాలి బూడిదైంది. ఇటీవల పొలంలో యంత్రంతో నూర్పు చేసి, అక్కడే బస్తాలను ఉంచారు. శనివారం సాయంత్రం గొరేష్ పొలానికి వెళ్లి చూడగా, బూడిద మాత్రమే మిగిలింది. ఆరు నెలల కష్టం అగ్నికి ఆహుతి కావడంతో గుండెలవిసేలా విలపించాడు. అప్పులు చేసి పంట పెట్టుబడి పెట్టానని, పంట చేతికొచ్చాక చిల్లిగవ్వ లేకుండా పోయిందని రోదించారు. గిరిజన సంఘ నాయకులు భైరిసింగి ధరణి దృష్టికి ఈ విషయం తీసుకెళ్లగా... ఆమె ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, తహశీల్దార్ బడే పాపారావు, ఎస్ఐ రమేష్‌బాబుకు సమాచారం అందించారు. ఘటనాస్థలిని తహశీల్దార్, ఎస్ఐ, ఇతర అధికారులు పరిశీలించారు. బాధిత రైతును ఆదుకుంటామని ఎమ్మెల్యే గోవిందరావు భరోసానిచ్చారని గిరిజన సంఘ నాయకులు ధరణి తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

వరికుప్ప దగ్ధం

నందిగాం: మండలంలోని పెంటూరుకు చెందిన మట్ట పాపారావు అనే రైతుకు చెందిన 50 సెంట్ల వరి కుప్ప ఆదివారం దగ్ధమైంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడికి చేరి మంటలను అదుపు చేసినా అప్పటికే కాలిపోయింది. ప్రభుత్వం పంట నష్టం కింద పేద రైతుకు పరిహారం ఇప్పించాలని కోరుతున్నారు. ఈ ప్రమాదంలో రూ.50 వేలు ఆస్తినష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోతున్నారు.

ఎంపిపి ప్రతినిధి పరామర్శ

లావేరు: ఎచ్చెర్ల నియోజకవర్గం వైసిపి నాయకులు, రణస్థలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ ఆదపాక గ్రామానికి చెందిన వార్డుమెంబర్ గొర్లె సత్యనారాయణను ఆదివారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడు తున్న విషయం తెలుసుకుని అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట సర్పంచ్ గొర్లె ప్రభాకర్, ఎంపిటిసి గంట్యాడ సత్యం తదితరులున్నారు.



మెళియాపుట్టి : పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదివారం పరామర్శించారు. కొసమాలకు చెందిన టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ అంకడాల లోకనాథం, వసుంధరకు చెందిన డకర నరసింహారావు, ఇదే గ్రామానికి చెందిన గేదెల వనజాక్షి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. టిడిపి తరుపున, వ్యక్తిగతంగా బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ, బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సలాన శరత్‌కుమార్, ఎఎంసి చైర్మన్ ప్రతినిధి బైరసింగ్ దినకర్, బొచ్చు ప్రసాదరావు, తెలుగు యువత మండల అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, ఎంపిటిసి ప్రతినిధి కదంబల పైడిరాజు, సర్పంచ్ రవ్వల గణపతిరావు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని కురిగాంకు చెందిన టిడిపి నాయకులు ఎస్.విక్రమ్ తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గోవిందరావు పరామర్శించారు. కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈయన వెంట వైస్ ఎంపిపి లోతుగడ్డ తులసీవరప్రసాదరావు, టిడిపి నాయకులు పైల లక్ష్మణరావు, కొయిలాపు సంజీవరావు, సర్పంచ్ ఎస్.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

తిలకం సినిమాను ఆదరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఎస్.శంకర్ ఫిలిం నిర్మాణంలో రూపొందుతున్న విజయ తిలకం సినిమా ఉత్తరాంధ్ర నుదుటన తిలకం దిద్దనుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఉన్న ఎస్ఎస్ క్రిస్టల్ ప్యాలెస్‌లో తిలకం సినిమా టైటిల్‌ను సినిమా దర్శకుడు షకలక శంకర్‌తో కలిసి ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా నుంచి కళా రంగంలో రాణించి బుల్లితెరలో జబర్దస్త్ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది అభిమానులను షకలక శంకర్ సంపాదించుకున్నారన్నారు. ప్రస్తుతం డైరెక్షన్ వైపు తన ప్రస్థానాన్ని ప్రారంభించి గొప్ప సందేశాత్మక చిత్రాలు నిర్మించి జిల్లా కీర్తిని మరింతగా ఇనుమడింప చేయాలన్నారు. చిత్ర నిర్మాణానికి తనతో పాటు, ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. దర్శకుడు, నటుడు షకలక శంకర్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా అంటే తనకు ఎనలేని మక్కువ అని అన్నారు. అందుకే ఉత్తరాంధ్ర నేపథ్యంలో తిలకం చిత్రం నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటివరకు తనకు హీరోగా, సహనటుడుగా ఎంతో సహకరించిన ప్రేక్షకులు తిలకం సినిమాను కూడా ఆదరించి తనను ప్రోత్సహించాలని కోరారు. ఈ సినిమా కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరిది ఈ చిత్రమని చిత్రంలోని నటులు, సాంకేతిక సిబ్బందికి కూడా ఈ చిత్రాన్ని అంకితమిస్తున్నానన్నారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు పాండ్రంకి శంకర్, ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాసరావు, డాక్టర్ పిజె నాయుడు, తైక్వాండో శ్రీను, టిడిపి నాయకులు పిఎంజె బాబు, మైలపిల్లి నరసింహామూర్తి, నాగేంద్రయాదవ్, కరగాన భాస్కరరావు, కోరాడ రమేష్ పాల్గొన్నారు.



తిలకం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్, నటుడు శంకర్

ఆదిత్యుని ఆదాయం రూ.7.78 లక్షలు

అరసవల్లి : అరసవల్లి సూర్యనారాయణ స్వామి హుండీ ఆదాయం ఆదివారం లెక్కించారు. ఆలయ ఇఒ కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన హుండీ ఆదాయం రూ.7,78,935 వచ్చింది. టిక్కెట్ల రూపేనా రూ.4,52,700, విరాళాల రూపంలో రూ.62,980, ప్రసాదాల రూపంలో రూ.2,63,255 ఆదాయం వచ్చింది. అలాగే ఆదివారం యాత్రికులు సందర్శించారు. యాత్రికుల సౌకర్యార్థం టెంట్లు వేసి , క్యూలైన్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చర్యలు చేపట్టారు.



ఆత్మీయ కలయికలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల 1972-1975 బిఎస్‌సి (బి.జెడ్.సి, జెడ్.సి) బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళం స్థానిక హోటల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో డిగ్రీ పూర్తిచేసి 50 ఏళ్లు గడిచిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి 20 మంది పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు. పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ప్రతి ఏడాది కుటుంబాలతో కలుసుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సురంగి మోహనరావు, యరుకోల మురళీమోహన్‌రావు, నారా ఈశ్వరరావు, సీపాన వెంకటరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

కళింగ ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ఈనెల 28న ఎచ్చెర్ల గ్రామం చౌదరి సత్యనారాయణ తోటలో కళింగ వనభోజనాలు నిర్వహిస్తున్నామని, దీనిని విసయవంతం చేయాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. టెక్కలిలోని ఓ కళ్యాణ మండపంలో ఆదివారం కళింగ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు మాట్లాడుతూ కళింగులంతా ఒక కుటుంబ సభ్యులుగా కలి ఉన్నప్పుడే ఏదైనా విజయం సాధిస్తామని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సంపతరావు జగదీష్, సీపాన శ్రీనుబాబు, చింతడా పార్వతేశం, మొదలవలస రమేష్ పాల్గొన్నారు.



రగ్గులను పంపిణీ చేస్తున్న రాంబాబు

రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో కొలిగాంలో 80 వృద్ధులకు యువ సూర్య ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాంబాబు సౌజన్యంతో టిడిపి మండల అధ్యక్షులు లోపింటి పద్మనాభం రగ్గులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజురోజుకీ చలిగాలులు పెరుగుతున్నాయని అన్నారు. దీంతో వృద్ధులకు రగ్గులు చాలా ఉపయోగక రంగా ఉంటుందని అన్నారు. ఈ మేరకు రాంబాబుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ గిన్ని బాలరాజు, కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, కొలిగాం, కీర్తిపురం, పాయతారి గ్రామాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

'పల్లె వెలుగు' ఎప్పుడో?

ఆర్‌టిసి బస్సులు లేక తప్పని అవస్థలు



ప్రజాశక్తి- బూర్జ

కూటమి ప్రభుత్వం మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేసినప్పటికీ తాము ఆ పథకానికి దూరమవుతున్నామని మండలంలోని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పాలకొండ నుంచి మండలంలోని వై.పర్త, అల్లెన, కిలంతరి తదితర గ్రామాలకు రోజూ ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళలో ఆర్‌టిసి బస్సులు నడిపే వారిని దీనివల్ల తాము కూడా పాలకొండ పట్టణానికి చేరుకునే వాళ్లమని మహిళలు అంటున్నారు. అలాగే పాలకొండ పట్టణం నుంచి రోజూ మండల కేంద్రమైన బూర్జ, వావం, ఉవ్వపేట, మామిడివలస తదితర గ్రామాలకు ఆర్‌టిసి బస్సులు తిరిగేవని, అలాగే రోజూ శ్రీకాకుళం పట్టణం నుంచి ఆమదాలవలస, పాలకొండ పట్టణం నుంచి తోటవాడ, కొల్లివలస ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సులు నడిచేవని అయితే ప్రస్తుతం కొన్నేళ్లుగా ఈ గ్రామాలకు ఆర్‌టిసి బస్సులు నిలుపుదల చేయడంతో తాము తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నామని మహిళలకు వాపోతున్నారు. అల్లెన, నీలంపేట, నారాయణపురం, గుత్తావల్లి, గిరిజన గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో రోజూ ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి వస్తుందని ఆయా గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

ఉచిత బస్సు ప్రయాణం దూరం...

అయితే మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నప్పటికీ తాము దూరమయ్యామని మహిళలు వాపోతున్నారు. ముఖ్యంగా అత్యవసర సమయాల్లో ప్రైవేట్ వాహనాలు ఆశ్రయించాల్సి వస్తుందని, అందుకు వ్యయ ప్రయాసలు తప్పడం లేదని, ఇప్పటికైనా సంబంధిత ఆర్‌టిసి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మా గ్రామాలకు తిరిగి బస్సులను పునరుద్ధరించాలని, అలాగే మిగిలిన గిరిజన గ్రామాలకు బస్సు సర్వీస్‌లను వేయాలని ఆయా గ్రామాల ప్రజలు మహిళలు కోరుతున్నారు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు

తమ గ్రామాలకు ఆర్‌టిసి బస్సులు రాకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. ముఖ్యంగా అత్యవసర సమయంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మా గ్రామాలకు ఆర్‌టిసి బస్సులు నడిచే విధంగా చర్యలు చేపట్టాలి.

బస్సులు నడపాలి

తమ గ్రామాల్లో ఆర్‌టిసి బస్సులు నడిపే విధంగా అధికారులు చొరవ చూపాలి. గతంలో ఆర్‌టిసి బస్సులు నడిచేవి. అయితే కొన్నేళ్లుగా బస్సులను నిలుపుదల చేశారు. దీని వలన అనునిత్యం విద్యార్థులు, మహిళలు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలి.

అలరించిన సుస్వరలహరి



గీతాలను ఆలపిస్తున్న గాయనిలు

ప్రజాశక్తి- అరసవల్లి

ఆరోహి స్కూల్ అఫ్ మ్యూజిక్ ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో ఆదివారం పెంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సుస్వరలహరి సంగీతసాహిత్య మధురాతి మధురాలు కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో చిన్నారులు, మహిళా గాయకులు, యువగాయకులు సినీగీతాలను ఆలపించారు. సంగీత వాయిద్యాలతో సంగీత కచేరి నిర్వహించారు. జగదీష్ మాస్టారు నృత్య ప్రదర్శన ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ సిక్కోలు కళలకు నిలయమని, ప్రతీరోజు బాపూజీ కళామందిర్‌లో సంగీత సాహిత్య కార్యక్రమాలు జరగటం ఎంతో అభినందనీయమన్నారు. నాగేశ్వరరావు ఎంతో మంది శిష్యులకు శిక్షణ ఇవ్వడం వారు ప్రతిభా పాఠవాలను ప్రదర్శించటం గొప్ప విషయమన్నారు. అనంతరం కళాకారులను సత్కరించారు. కళాకారుల సమాఖ్య అధ్యక్షులు ఎల్.రామలింగస్వామి, సూడా ఇంజినీరు పొగిరి సుగుణాకరరావు, బాస్కరబట్ల శ్రీరామశర్మ, విశ్రాంత డిప్యూటి డిఇఒ కొత్తకోట అప్పారావు, మణిపాత్రుని నాగేశ్వరరావు, ఎం.భాస్కరరావు, ఎస్.ఈశ్వరరావు, మణిపాత్రుని తిరుమలరావు, మండా కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న ప్రముఖులు



సుధామూర్తికి చిత్రపటాన్ని అందజేస్తున్న ఇఒ తదితరులు

ప్రజాశక్తి- అరసవల్లి

ప్రత్యక్షదైవం శ్రీసూర్యనారాయణ స్వామిని ఆదివారం సెంట్రల్ సివిల్ ఏవియేషన్ మినిస్టర్ కింజరాపు రామ్మోహన్‌నాయుడు కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ ఇఒ కెఎన్‌విడివి ప్రసాద్ ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేశారు. అలాగే విద్యావేత్త, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు సుధా నారాయణ మూర్తి కూడా స్వామి వారిని కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. అలాగే యాత్రికులకు ఆలయ ఇఒ ప్రసాద్ ఆధ్వర్యంలో టెంట్లు వేసి, క్యూలైన్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దర్శనాలు కల్పించారు.

ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఉద్యోగుల సంఘం ఎన్నిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఉద్యోగుల సంఘం శ్రీకాకుళం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్నికలు నిర్వహించారు.

ఎన్నికల అధికారిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పారావు వ్యవహరించారు. రాష్ట్ర అధ్యక్షులు బ్రహ్మానంద్ రెడ్డి, ఎపిఎన్‌జిఒ సంఘం శ్రీకాకుళం టౌన్ అధ్యక్షులు బొచ్చ శ్రీను, వైస్ ప్రెసిడెంట్ శ్రీరామ్ హాజరై ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. కార్యవర్గంలో అధ్యక్షులుగా జొన్న పవన్ కుమార్, ఉపాధ్యక్షులుగా కె.నరేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.రేవంత్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.మధుబాబు, మహిళా కార్యదర్శి కె.యశోదలను ఎన్నుకున్నారు. ఉద్యోగులు సమస్యపై పోరాటం చేస్తున్నాయని చెప్పారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

నడకతో ఆరోగ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

డిస్ట్రిక్ట్ ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ 102 సంఘం ఆధ్వర్యంలో కాన్ఫరెన్స్ 2025 కార్యక్రమం నగరంలో ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల వాకర్సు ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని మాట్లాడుతూ నడక ద్వారా ఆరోగ్యం వస్తుందని, ఎప్పుడూ ఉత్సాహంగా పనులు నిర్వహించుకునేందుకు నడక ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మన రాష్ట్రం నుంచి వాకర్స్ అసోసియేషన్ స్థాపించి ప్రపంచ వ్యాప్తంగా 16 సంఘాలతో ఈరోజు నడుస్తున్న వాకర్స్ సంస్థ దేశానికి గర్వకారణం అని అన్నారు. రాకేష్ ప్రతినిధులు, పలువురు పట్టణ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి- పలాస

నిరు పేదలు వివిధ రకాల కారణాలతో ఆర్థిక ఇబ్బందులు, సమస్యలతో సతమతమవుతున్న తరుణంలో సిఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రూ.2.23 లక్షల చెక్కులను లబ్ధిదారులకు ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొందర కవిత పాత్రో రూ. 60 వేలు, దుమ్ము ఏకాంబరం రూ.60,752లు, అనురాధ పాణిగ్రహి రూ. 46,084లు, కంచరాన కిరణ్ కుమార్ రూ.56,441లు చొప్పున చెక్కులను పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, గాలి కృష్ణారావు, దువ్వాడ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్

ప్రజాశక్తి- నరసన్నపేట



ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం విజయవంతమైందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సంతకాలు విజయవంతం సందర్భంగా ఈ నెల 15న జిల్లా కేంద్రంలో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ర్యాలీ ద్వారా మెడికల్ కళాశాలల ప్రైవేటు పరంపై ప్రజల నుంచి వ్యక్తమవుతున్న నిరసనను ప్రభుత్వం దృష్టికి మరింత బలంగా తీసుకెళ్లాలని అన్నారు. ఇప్పటికే ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిన అన్నారు. ఈ ఉద్యమంతో మరింత బలం చేకూర్చుతుందని అన్నారు. అందువల్ల పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, ఎమ్మెల్సీలు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొవాలని కోరారు.